భగ్గుమంటున్న ఎండలు

- ఉధృతమవుతున్న వడగాలులు
- పుట్టపహాడ్, బంట్వారం, గన్‌పూర్‌లలో 44.8డిగ్రీలు నమోదు

వికారాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం వికారాబాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం పుట్టపహాడ్, బంట్వారంలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం గన్‌పూర్‌లో 44.8 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 44 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం నాగారంలో 43.9 డిగ్రీలు, మర్పల్లిలో 43.6 డిగ్రీలు, కోట్‌పల్లిలో 43.3, కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో 43.2, మోమిన్‌పేట్‌లో 43 డిగ్రీలు నమోదయ్యాయి. తాండూరులో 42.9, బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో 42.8, నవాబ్‌పేట్‌లో 42.6, యాలాల్‌లో 42.5, యాలాల్ మండలం దౌలాపూర్‌లో 42.5, బషీరాబాద్‌లో 42.4, ధారూరులో 42.2, చౌడాపూర్‌లో 42.1, పెద్దేముల్‌లో 42 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. దౌల్తాబాద్‌లో 42, యాలాల్ మండలం తాండూరు ఏఆర్‌ఎస్‌లో 41.9, పరిగి మండలం రాపోల్‌లో 41.8, వికారాబాద్‌లో 41.6, పూడూరు మండలం, పెద్ద ఉమ్మెంతాల్‌లో 41.6, దుద్యాల్‌లో 41.5, పూడూరు మండలం మన్నెగూడలో 41.4, దోమలో 41.3, కొడంగల్‌లో 41.2, వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టంపల్లిలో 40.7డిగ్రీలు, వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో 40.6 డిగ్రీలు, పరిగిలో 40.4, బొంరాస్‌పేట్‌లో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 33.2 డిగ్రీలుగా నమోదైంది.



విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పదో తరగతి ఫలితాలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. మంగళవారం బషీర్‌బాగ్‌లోని ఎస్‌సీఈఆర్‌టీలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం పదో తరగతి ఫలితాలను విడుదల చేశారు. అయితే ఉమ్మడి జిల్లాలో పది ఉత్తీర్ణతా శాతం పడిపోయింది. రాష్ట్రంలో రంగారెడ్డి, 24, మేడ్చల్ 27,వికారాబాద్ చివరి స్థానంలో నిలిచింది. కాగా ఈ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులు



లక్ష్మీప్రసన్న, జడ్పీహెచ్‌ఎస్, నూతన్‌కల్
కల్లెపల్లి హాసిని, జడ్పీహెచ్‌ఎస్, మేడ్చల్
సితార, టీడబ్ల్యూఆర్‌ఎస్, పరిగి
మీనాక్షి, టీడబ్ల్యూఆర్‌ఎస్, పరిగి
రాంచరణ్‌రెడ్డి, జడ్పీహెచ్‌ఎస్, కీసర
వైష్ణవి, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బంట్వారం
డి.అవినాష్, ఎంజేపీటీ, కంటోన్మెంట్
పి.హరిచంద్, టీఎస్‌డబ్ల్యూఈఆర్ కొడంగల్
డి.సుగేందర్, ఎంజేపీటీ, కొడంగల్
నిఖిత, జడ్పీహెచ్‌ఎస్, మేడకవనంపల్లి



- రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాకు 24, మేడ్చల్‌కు 27, వికారాబాద్‌కు 33వ స్థానం
- రంగారెడ్డిలో పెరిగిన 4.04 శాతం ఉత్తీర్ణత
- 30 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం పాస్
- 1,716 మందికి 10 జీపీఏ.. అమ్మాయిలదే పైచేయి
- వికారాబాద్‌లో 65.10 శాతం ఉత్తీర్ణత
- వికారాబాద్ టాప్... చౌడాపూర్ లాస్ట్

నిరాశే!

ఉమ్మడి జిల్లాలో పడిపోయిన టెన్త్ ఉత్తీర్ణతా శాతం

వికారాబాద్ జిల్లా వివరాలు	
హాజరైన విద్యార్థులు	13,357
ఉత్తీర్ణులైన విద్యార్థులు	8,695
ఉత్తీర్ణత శాతం	65.10
హాజరైన బాలురు	6,664
ఉత్తీర్ణులైన బాలురు	3,821
ఉత్తీర్ణత శాతం	57.34
హాజరైన బాలికలు	6,693
ఉత్తీర్ణులైన బాలికలు	4,874
ఉత్తీర్ణత శాతం	72.82

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 30: గత మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో అమ్మాయిలే సత్తా చాటారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 50,811 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా అందులో 46,245 మంది విద్యార్థులు పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 91.01 నమోదైంది. రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 24వ స్థానంలో నిలిచింది. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గత ఏడాది కంటే ఈసారి 4.04 శాతం పెరిగింది. గత ఏడాది జిల్లాలో 47,702 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 41,488 పాసయ్యారు. ఉత్తీర్ణత 86.97 శాతం నమోదైంది. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా 27వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 3 స్థానాలు దిగజారింది. గతేడాది 24వ స్థానంలో నిలిచింది. జిల్లాలో మేడిపల్లి మండలంలో అత్యధికంగా 93.52 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, అత్యల్పంగా మల్కాజిగిరి మండలంలో 86.68శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మరోసారి వికారాబాద్ జిల్లా అట్టడుగుస్థానంలో నిలిచింది. పదో పరీక్షల్లో 65.10 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 33వ స్థానంలో నిలిచింది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలవడం వరుసగా ఇది రెండోసారి. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత 15.48 శాతం అధికంగా ఉండడం విశేషం. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో వికారాబాద్ మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఫలితాల్లో 80.06 శాతం ఉత్తీర్ణత సాధించింది. అత్యల్పంగా చౌడాపూర్ మండలం 37.5 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకుంది.

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2018	43,392	37,809	87.13
2019	45,747	42,467	92.83
2022	47,157	42,460	90.04
2023	47702	41488	86.97

రంగారెడ్డి జిల్లా 2024 పరీక్ష ఫలితాలు

కేటగిరి	హాజరు	పాస్	శాతం
బాలురు	26,446	23,508	88.89
బాలికలు	24,365	22,737	93.32
మొత్తం	50,811	46,245	91.01

వికారాబాద్

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	రాష్ట్రంలో స్థానం
2024	65.10	33
2023	59.46	33
2022	90.42	24
2020-2021 కరోనా		
2019	88.82	25
2018	75.39	26

ఫలితాల్లో టీఎస్ గురుకులాలు మేటి

పదో తరగతి ఫలితాల్లో మరోసారి టీఎస్ గురుకులాలు తమ సత్తా చాటుకున్నాయి. వికారాబాద్ జిల్లాలో టీఎస్‌గురుకులాలు 98.68శాతం ఉత్తీర్ణత సాధించాయి. గిరిజన సంక్షేమ గురుకులాలు 97.43 శాతం, బీసీ సంక్షేమ గురుకులాలు 94.33 శాతం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 90 శాతం, మైనార్టీ గురుకులాలు 86.64 శాతం,ప్రైవేట్ పాఠశాలలు 86.51 శాతం, ఎయిడెడ్ పాఠశాలలు 70.4 శాతం, కేజీబీవీలు 65.81 శాతం, ఆశ్రమ పాఠశాలలు 65.22 శాతం, మోడల్ పాఠశాలలు 61.14 శాతం, జడ్పీ ఉన్నత పాఠశాలలు 48.63 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 46.01శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఉమ్మడి జిల్లాలో 1,716 మంది విద్యార్థులకు 10 జీపీఏ

ఈసారి పదో తరగతి పరీక్షల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 10 జీపీఏ సాధించిన

మిగతా 7వ పేజీలో...



ఘట్‌కేసర్‌లో నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

రూ.5.15లక్షలు పట్టివేత

- ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఘట్‌కేసర్ రూరల్/దౌల్తాబాద్/కొత్తూర్, ఏప్రిల్ 30: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వేర్వేరు చోట్ల పోలీసులు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తూ పరిమితికి మించి వాహనదారుల వద్ద ఉన్న నగదును పోలీసులు సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగిస్తున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధి శివారెడ్డిగూడ సమీపంలో మంగళవారం స్కూటర్(టీఎస్08 ఎఫ్‌టీ0041)ను తనిఖీ చేయగా రూ.3లక్షల లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. పోచారం పరిధి అన్నోజిగూడకు చెందిన డి.కరుణాకర్ అనే ఆటో డ్రైవర్ నగదును తరలిస్తున్నాడు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో జిల్లా గ్రీవియేన్స్ కమిటీకి అందజేసినట్లు పోలీసులు తెలిపారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.71,500 పట్టుబడినట్లు ఎస్సై శ్రీశైలంయాదవ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్‌కల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కారులో రూ.71,500 లభించగా సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ సమీప పెంజర్ల రోడ్డులో ఎఫ్‌ఎస్‌టీ టీం పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. ఓ కారులో తరలిస్తున్న 1,43,800 రుపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. కొత్తూర్ తండా వద్ద వాహనాలు తనిఖీ చేయగా తిరుమల రోటో ల్యామ్ పరిశ్రమకు చెందిన లక్ష్మీకాంత్ బజాజ్ కారును తనిఖీ నిర్వహించగా డబ్బు లభ్యమైందన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు చూపనందున సీజ్‌చేసి గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించామని ఎస్ఐ వివరించారు.

- చట్టాలకు ప్రభుత్వాల తిలోదకాలు
- నిర్లక్ష్య ధోరణితో అధికారులు
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- అందరూ కార్మికుల శ్రమను దోచుకునేవారే...
- పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న శ్రమ జీవులు

మారని కార్మికుల బతుకులు!



మేడ్చల్, కొత్తూరు ఏప్రిల్ 30: రాత్రింబవళ్లు మండుతున్న యంత్రాల మధ్య సుర్రుమనే ఎండల్లో పనిచేసే కార్మికుల బతుకులు ఏటికేడు దుర్భరంగా మారుతున్నాయి. ప్రతీ సంవత్సరం ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకుంటున్నా.. కార్మికులు మాత్రం కనీస వేతనాలు, సౌకర్యాలు, సామాజిక భద్రతలకు నోచుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి చట్టాలు రూపొందిస్తున్నా వాటిని పారిశ్రామికవేత్తలు అమలు చేయడం లేదు. యాజమాన్యాలు కార్మిక హక్కులను కాలరాస్తూ, చట్టాలను ఉల్లంఘిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. పనిచేసే చోట్ల కార్మికులకు భద్రత పరికరాలివ్వడం లేదు. రోజూ ప్రాణాలను పణంగా పెడుతూ కార్మికులు మిషన్ల వద్ద పనిచేస్తున్నారు. పరిశ్రమల యజమానుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి కొన్నిసార్లు కార్మికులు ప్రాణాలే పోతున్నాయి. మరికొందరు క్షతగాత్రులు అవుతున్నారు.



పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలతో కొన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నారు.

దశాబ్దాల కింద ఏర్పాటైన కొత్తూర్ పారిశ్రామికవాడ

1976లో ప్రభుత్వం ప్రస్తుత రంగారెడ్డి జిల్లా కొత్తూర్ సమీపంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం రాయితీలతో పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేశారు. కొత్తూర్ పారిశ్రామికవాడ, మండలంలోని తిమ్మాపూర్, కొడిచర్ల, పెంజర్ల, ఇన్ముల్‌నర్వ నంది గామ మండలం రంగాపూర్, మేకగూడ, చేగూర్ గ్రామాల్లోనూ పరిశ్రమలు వెలిశాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, కొందుర్గు మండలాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ ప్రాంతంలో 300కు పైగా భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ పరిశ్రమల్లో 35వేల మంది వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల వారు కొత్తూర్ పారిశ్రామికవాడలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో 30శాతం మందే

మిగతా 7వ పేజీలో...

ప్రతీ పోలింగ్‌స్టేషన్ లొకేషన్‌కో ఇన్‌చార్జి

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 30 : రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతి పోలింగ్ స్టేషన్ లొకేషన్‌కు ఇన్‌చార్జి అధికారులను నియమించామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ. బీఎల్‌వోలతో ప్రతీ ఇంటికి ఓటరు స్లిప్పులు పంపిణీ జరిగేలా చూడాలని, ఎన్నికల ముందు రోజు పోలింగ్ సిబ్బందికి వసతి ఏర్పాటు , పోలింగ్ రోజు మాక్ పోల్ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాలలో శానిటేషన్ పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అవకాశమున్న ప్రతి గ్రామంలో కూలీల సమీకరణజరుగాలలన్నారు. ఈ సందర్భంగా మండలం వారీగా ఏమండలంలో ఎంత మంది లేబర్ సమీకరణ జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీపీవో జయసుధ, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా ఎన్నికల విధుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని ఎంప్లాయ్ ఐడీ చూసుకొని దరఖాస్తు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను వదిలిపెట్టి బయటకు వెళ్లవద్దని, రికార్డ్‌లో ఒక్క ఓటు కూడా తేడా రాకుడదని, రిజిస్టర్లు ప్రాపర్‌గా నిర్వహించాలని తప్పులు లేని ఓటరు స్పెషాలిటీ సెంటర్లు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రావు, మాస్టర్ ట్రైనర్ వీరకాంతం, తదితరులు పాల్గొన్నారు.

సీసీఐలో రూ.22కోట్లతో అభివృద్ధి పనులు

- సీసీఐ సిమెంటు నాణ్యత పెంచేందుకే ఫ్లయాస్ సెల్లో మిక్సింగ్
- సీసీఐ కర్మాగారాల సీఎండీ సంజయ్ బంగా




ఫ్లయాస్ హోల్డింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న సీఎండీ సంజయ్‌బంగా

తాండూరురూరల్, ఏప్రిల్ 30 : వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామ శివారులోని ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో రూ.12కోట్లతో నిర్మించిన ఫ్లయాజ్ హోల్డింగ్ సిస్టం, రూ.10కోట్లతో కోల్‌షెడ్(బొగ్గుషెడ్డు)నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర సీసీఐ కర్మాగారాల సీఎండీ సంజయ్ బంగా మాట్లాడుతూ సీసీఐ సిమెంటు మరింత నాణ్యతగా ఉండేందుకు ఫ్లయాజ్‌ను వాడుతున్నామని పేర్కొన్నారు. టర్మినల్ పవర్‌లో వాడివదిలేసిన బొగ్గును మెటీరియల్‌ను ఫ్లయాస్‌లో కలిపి సిమెంటులో వాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సిమెంటులో కలిపే బొగ్గును కర్మాగారం ఆవరణలో వర్షాలకు నానకుండా ఉండేందుకు రూ.10కోట్లతో కోల్ షెడ్డును, స్టాక్‌పాయింట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు సీసీఐ సిమెంటు కర్మాగారాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అందులో భాగంగా రూ.22 కోట్లు వెచ్చించి మోడలైజేషన్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. సీసీఐ కర్మాగారంలో కార్మికులు నిరంతరం కష్టపడి సీసీఐ నాణ్యతను పెంచడంతోపాటు ఉత్పత్తి అయిన సిమెంటును మార్కెటింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి సంవత్సరం సిమెంటు ఉత్పత్తి లక్ష్యం మేరకు సాధించేలా చర్యలు చేపట్టామని, అందులో భాగంగానే కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంపై ప్రత్యేక దృష్టి సారించి, ఇతర కర్మాగారాలతో పోటీ పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిమెంటు ఉత్పత్తులకు అనుగుణంగా మార్కెటింగ్‌ను పెంచి అన్ని విధాల అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జీఎం మహనా, టెక్నికల్ జనరల్ మేనేజర్ అగర్వాల్, మెకానికల్ హెచ్‌వోడీ విపుల్ కుమార్, పర్సనల్ హెచ్‌వోడీ అమిత్‌రంజన్, ప్రొడక్షన్ మేనేజర్ మనోహర్, ఎలక్ట్రికల్ హెచ్‌వోడీ రమణమూర్తి, సిమెంటు మిల్ ఇన్‌చార్జి బసయ్య తదితర కార్మికులున్నారు. అనంతరం సీసీఐ కంట్రోల్ రూం, కిలన్, ప్యాకింగ్ ప్లాంట్, రామిల్, కోల్‌మిల్ తదితర విభాగాలను పరిశీలించారు.

భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ
- నైవేద్యాలు సమర్పించిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో భద్రేశ్వరస్వామి

తాండూరు, ఏప్రిల్ 30: తొమ్మిది రోజుల పాటు జరిగే తాండూరు శ్రీ భావిగిభద్రేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. మంగళవారం ఉదయం స్వామి వారికి జాలాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి గర్భగుడిలో ప్రత్యేక పూజలు, పాదుకల పూజలు, నిర్వహించగా పుష్పలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. త్రాతల లింగపూజము, దాసోహమూర్తులుగా ఖ్యాతి చెందిన భద్రేశ్వర స్వామికి కర్ణాటక రాష్ట్ర భక్తులు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జ్యోతిపద్మ



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతిపద్మ

వికారాబాద్, ఏప్రిల్ 30: పిల్లలకు ఆరోగ్యం, పరిశుభ్రత, కుటుంబంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదలపై శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ తెలిపారు. జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో బాలల సంరక్షణ గృహంలోని పిల్లల స్థితిగతులపై నిర్వాహకులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలకు పౌష్టికాహారం అందించాలని, ప్రతీఒక్క సంరక్షణ గృహంలో పిల్లల ఆహార పట్టిక తప్పక ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లలు ఆటపాటలు ఆడుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. సంరక్షణ గృహాలలోని సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే జిల్లాలోని బాల పరిరక్షణ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్పర్సన్ వెంకటేశ్ మాట్లాడుతూ. జిల్లాలోని బాలల సంరక్షణ గృహాలు, పనితీరు, కనీస వసతుల కల్పన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య పరిశుభ్రతతో పాటు వేసవిలో పిల్లలకు ఆటపాటలకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన హోం నిర్వాహకులు మేనేజర్లు వారి కేంద్రాల పనితీరు పిల్లల ఆరోగ్య విద్య పరిస్థితులపై వివరించారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు ప్రకాశ్, సంగమేశ్వర్, బాలల పరిరక్షణ అధికారులు శ్రీకాంత్, అంజనేయులు, సంరక్షణ గృహాల మేనేజర్లు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

దౌల్తాబాద్, ఏప్రిల్ 30: జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కుదురుమళ్ల, యాంకి, సంగాయిపల్లి, నందారం గ్రామాల్లోని చెరువుల్లో ఒండ్రు మట్టి, పూడిక తీత పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పనిప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు అందుబాటులో ఉంచాలని ఏపీవో రజనీకాంత్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యంపీవో రవీందర్, వివిధగ్రామాల టెక్నికల్ అసిస్టెంట్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

నవాబుపేట: మండలంలోని ఎక్‌మామిడి, ఎల్లకొండ, నవాబుపేట గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మంగళవారం అధికారులు పరిశీలించారు. కూలీ డబ్బులు సక్రమంగా అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పనులు చేస్తున్నారు, సౌకర్యాలు కల్పిస్తున్నారా అని కూలీలతో అడిగారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ మేనేజర్ శివరాములు, మమత, ఏపీడీ సరళ, ఇంచార్జ్ ఎంపీడీవో అజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, టీఏలు భాస్కర్, విశ్వనాథ్, శ్రీరాములు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలింగ్ సిబ్బందికి శిక్షణ

తాండూరు, ఏప్రిల్ 30: పోలింగ్ సిబ్బందికి నేటి నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో డీవో, డీపీవో సహాయ సిబ్బందికి తాండూరు ప్రభుత్వ నెం-1 ఉన్నత పాఠశాలలో రెండోవిడత ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. పీవో, ఏపీవోలకు మే1న ఇతర సిబ్బందికి 4వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 277 పోలింగ్ కేంద్రాలకు 1276 మందిని నియమించామన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా బుగ్గప్ప

దౌల్తాబాద్, ఏప్రిల్ 30: బీజేపీ వికారాబాద్ జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన పోతుల బుగ్గప్పకు మంగళవారం పార్టీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి నియామక పత్రం అందించారు. బీజేపీ నాయకులు కుంద్రున ర్సింహులు, సతీశ్‌ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాహుల్ శర్మ

గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

▸ వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 30: గ్రూపు 1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జూలైలో నిర్వహించే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు రీజినల్ కోఆర్డినేటర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో గ్రూపు 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు 6500 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా సామర్థ్యం 17పరీక్ష కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. వికారాబాద్‌లో తొమ్మిది, తాండూరులో ఐదు, పరిగిలో మూడు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులతో సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ సూచనల మేరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక సదుపాయాలతో పాటు ప్రహరీ, విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. పరీక్షా సమయంలో పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశంలు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి

కొడంగల్, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ లేదా కంట్రోల్ రూమ్ నెం.08505 284080 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్, కొడంగల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ నిబంధనలను పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఎన్నికల్లో ఓటర్లను రాజకీయ పార్టీల నాయకులు ప్రలోభాలకు గురి చేయడం, డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు. మే 13న ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్నీ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వీధి నాటకాలను ప్రాచుర్యంలోకి తేవాలి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 30: సమాజంలో కులవృత్తుల వారు నిర్వహించే వీధి నాటకాలు అంతరించి పోతున్నాయని, మళ్లీ వాటికి పూర్వవైభవం తెచ్చేలా ప్రాచుర్యంలోకి తేవాలని బీజేపీ మండల సీనియర్ నాయకుడు గరుగు రాజు అన్నారు. చిలుకూరులో శ్రీ రేణుక ఎల్లమ్మ వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లమ్మ నాటకం వేశారు. రాజు మాట్లాడుతూ గతంలో వీధి నాటకాలకు ఎంతో ఆదరణ ఉండేదన్నారు. గ్రామాలకే పరిమితమైన వీధి నాటక ప్రదర్శనలను పట్టణాల్లోనూ ఆడటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బక్క జక్రయ్య, దర్గా ప్రభు, అన్నబోయిన రాజు, చాకలిగూడెం రాజు, కె.క్రిష్ణారెడ్డి, సదువు జంగయ్య, గరుగు అంజయ్య, సదువు శ్రీనులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భువనగిరి పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా విజయ్‌నాయక్

యాచారం, ఏప్రిల్ 30: తక్కళ్లపల్లి తండాకు చెందిన విజయ్‌నాయక్‌ను భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్‌గా నియమిస్తూ మంగళవారం జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ జి.రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌నాయక్ మాట్లాడుతూ పార్టీ లీగల్ సెల్ ఎంతో నమ్మకంతో పార్టీ అప్పగించి బాధ్యతలను నెరవేరుస్తుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తానని చెప్పారు. కార్యకర్తలకు న్యాయపరంగా అండగా ఉంటానన్నారు. భువనగిరిలో విజయానికి శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మురళి, ప్రశాంత్, వంశీకృష్ణ, రామ్‌అర్జున్ తదితరులు ఉన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేస్తా

▸ బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 30: ఎన్నికల్లో తనను గెలిపిస్తే రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో రైతు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, దేశంలో రైతులందరినీ ధనవంతులు చేయాలని ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలు చేపట్టారని చెప్పారు. ఫసల్‌భీమా, కృషిసించాయ్, కిసాన్ సమ్మాన్, వంటి పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకాలను తెలంగాణ రైతాంగానికి అందకుండా చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పంటలకు మద్దతు ధర కల్పించిందన్నారు. చేవెళ్ల ప్రాంతంలో రైతుల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. చేవెళ్లను మిల్లెట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. నరేంద్రమోదీ మరోమారు ప్రధాని అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. బీజేపీ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. బీజేపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో బీజేపీ బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు తల్లోజు ఆచారి, అంజన్‌కుమార్‌గౌడ్, విఠల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు మధుసుదన్‌రెడ్డి, కిరణ్, పాండు రంగారెడ్డి, రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శివానందం, మండల నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, అంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, కె.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నాగర్జున్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, చందు, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో చేవెళ్ల మండలంలోని రేగడిఘనాపూర్, కౌకుంట్ల, బస్తేపూర్, మీర్జగూడ, దేవునిఎర్రవల్లి, అంతారం తదితర గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వందలాది మంది బీజేపీలో చేరారు.



చేవెళ్ల : సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మాదిగలు కాంగ్రెస్‌కు ఓటెయ్యొద్దు

వికారాబాద్: మాదిగలు ఏపార్టీలో ఉన్నా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మాత్రం ఓటు వేయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో మంగళవారం మాదిగ, మాదిగ ఉపకులాల ఆశీర్వాద సభకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన మొదట అనంతగిరి హరిత రిసార్ట్‌లో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నంలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మాత్రమే ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మూడు ఎంపీ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో మాదిగలకు, ఉపఎన్నిక జరగనున్న ఒక అసెంబ్లీ స్థానంలోనూ మాదిగలకు అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని, బీజేపీ మూడు ఎంపీ స్థానాల్లోనూ మాదిగలకు అవకాశం ఇచ్చిందన్నారు. ఏ క్షణమైనా సుప్రీం కోర్టు నుంచి ఎస్సీ వర్గీకరణకు అనుకూల నిర్ణయం రావొచ్చు తెలిపారు. బీజేపీకి ఓటు వేసి చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని మంద కృష్ణ కోరారు. బీజేపీకి ఓటేస్తే 100 తరాల భవిష్యత్తు బాగుంటుందని ఒక అన్నగా చెబుతున్నానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుసార్లు నేను మాదిగ బిడ్డల ఓట్ల వల్లనే జడ్పీటీసీ ఎమ్మెల్యే ఎంపీ అయ్యాయని చెబుతారని కానీ మాదిగలకు మాత్రం చేసింది ఏమి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ మాదిగలను పూర్తిగా మోసం చేసిందని ప్రశ్నించామని మనపై కక్షగడుతున్నారని అన్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మాదిగల మేలు కోసం గత 30సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేసేందుకు మోదీ కంకణం కట్టుకున్నారని తెలిపారు. దేశం మొత్తం మోదీ వైపే చూస్తోందని, ప్రజలందరూ కమలం పువ్వుకు ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు వడ్ల నందు, నవీన్, ఎమ్మార్పీఎస్ ఆనంద్ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే వికారాబాద్ మండల వైఎస్ ఎంపీపీ కొండి రాములు, కోట్‌పల్లి మండలానికి చెందిన పతంగి పాండు బీజేపీ నాయకుడు వడ్లనందు ఆధ్వర్యంలో బీజేపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ప్రచారం

వికారాబాద్/ధారూరు/మర్పల్లి: వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి బీజేపీ ఎన్నికల ప్రచారం నాయకులతో కలిసి నిర్వహించారు. నాయకులు రాజేందర్ రెడ్డి, కేపీ రాజు, పోకల సతీష్, బుస్సా శ్రీకాంత్, అమర్ బూత్ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు. ధారూరు మండలంలోని తరిగోపుల, నాగసాన్‌పల్లి గ్రామాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్ గౌడ్ మంగళవారం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధారూరులో సోమవారం రాత్రి రంజిత్‌రెడ్డి ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథం, వివేకానందర్‌రెడ్డి, పాండుగౌడ్, ఎం.రమేశ్, నరేందర్ రెడ్డి, సాయిగౌడ్, కృష్ణా, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మర్పల్లి మండల కేంద్రంలోని బూత్ కమిటీల అధ్యక్షులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయకుడు విశ్వజిత్‌రెడ్డి సమావేశమయ్యారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

మారని కార్మికుల బతుకులు!

(ఐదో పేజీ తరువాయి)

పర్మినెంట్ కార్మికులుగా ఉన్నారు. 70శాతం మంది కార్మికులు కాంట్రాక్టు, క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, వేతనాల పెంపు వంటి సామాజిక భద్రత వసతులు వారికి లభించడం లేదు.



ప్రమాదాలు జరిగితే ప్రాణాలకు ముప్పే

పారిశ్రామికవాడలో అత్యధికంగా స్పాంజ్ ఐరన్, ఐరన్, రీ రోలింగ్, కెమికల్ పరిశ్రమలున్నాయి. వీటిల్లోని కార్మికులకు భద్రత పాటించడం లేదు. యంత్రాల మధ్య పనిచేసే కార్మికులకు హీట్ రెసిస్టెంట్ యాప్రాన్లు, గమ్‌షూస్, హెల్మెట్లు, గ్లౌజులు ఇవ్వాలి. కానీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు దివ్యాంగులుగా మారుతున్నారు. బాధితులకు నామమాత్ర పరిహారం ఇచ్చి యాజమాన్యాలు చేతులు దులుకుపుకుంటున్నాయి. ఐరన్, స్పాంజ్ ఐరన్, రీ రోలింగ్ మిల్స్ పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులకు సేఫ్టీ ప్రికాషన్స్ కరువయ్యాయి. వారికి ఇళ్లు, విశ్రాంతి గదుల సౌకర్యం కల్పించడం లేదు. మహిళా కార్మికులు రాత్రి సమయాల్లో ఇళ్లకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించడం లేదు. పరిశ్రమల శివార్లలో కార్మికులకు రేకుల షెడ్లు కట్టి వదిలివేస్తున్నారు. అక్కడ నీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి సౌకర్యాలేవీ కల్పించడం లేదు. కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్కర్లకు నిబంధనల మేరకు వేతనాలివ్వడం లేదు. 20 మందికిపైగా పనిచేసే పరిశ్రమల్లో అందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలి. కానీ ఇక్కడి 30శాతం పరిశ్రమల్లోనే కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చాలా మంది క్యాజువల్ లేబర్ పనిచేస్తూ ఎలాంటి సదుపాయాలకు నోచుకోవడం లేదు.

44 కార్మిక చట్టాలను కొనసాగించాలి



కేంద్ర ప్రభుత్వం గతంలో రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించి కోడ్ విధానాన్ని రద్దు చేయాలి. మే డే స్ఫూర్తితో పారిశ్రామికవేత్తలు చట్టాలను వెంటనే అమల్లోకి తేవాలి. కార్మికులకు కనీస సౌకర్యాలు, వేతనాలు అందించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలి. కార్మికులకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

- పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

కనీస వేతనాలు, మౌలిక వసతులు కల్పించాలి



కార్మిక చట్టాలను ఫ్యాక్టరీల యాజమాన్యాలు పాటించేలా కార్మికశాఖ చర్యలు తీసుకోవాలి. కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలు, మౌలిక వసతులు, విశ్రాంతి, భోజన గదులు, మంచి నీరు, అంబులెన్స్, ట్రాన్స్‌పోర్టు వసతులను కల్పించడం లేదు. కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కార్మికశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలి.

- బీస సాయిబాబ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు



జేసీబీతో తవ్వుతుండగా పైపులైను పగిలి నీరువృథాగా పోతున్న దృశ్యం

పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా

కీసర రూరల్, ఏప్రిల్ 30: నాగారం మున్సిపాలిటీ ఆర్ఎల్‌నగర్‌లో పైపులైను పగిలి తాగునీరు వృథాగా పోయింది. నాగారం మున్సిపాలిటీ ఆర్ఎల్‌నగర్‌లో ప్రధాన రహదారి రెవెన్యూ సర్వేనంబర్ 404, 405లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్లాట్ నంబర్ 31లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వుతున్నారు. రాత్రికి రాత్రే జేసీబీలతో మట్టి తరలింపు పనులు చేపట్టారు. దీంతో మంగళవారం ఉదయం ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన భారీ పైపులైను పగిలింది. దీంతో గంటల తరబడి నీరు వృథాగా పోయింది. ఇంత జరుగుతున్నా ఇటు మున్సిపల్, అటు జలమండలి అధికారులు అడ్రస్ లేకుండాపోయారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రోడ్డులో 200ఫీట్లు సెట్ బాక్ అయ్యి నిర్మాణాలు చేపట్టాలి. కానీ సదరు యజమాని ఇవేమి పట్టించుకోకుండా, అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మూడు రోజులుగా పనులు చేపట్టినప్పటికీ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుని పైప్‌లైన్ మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరాశే!

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులు 1,652 మంది ఉన్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలో 64 మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారు. అత్యధికంగా తాండూరులో 19 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, వికారాబాద్‌లో 18 మంది విద్యార్థులు, పరిగిలో 16 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. పూడూరులో నలుగురు, కొడంగల్‌లో ఇద్దరు, బంట్వారం, మర్పల్లి, మోమిన్‌పేట్, పెద్దేముల్, యాలాల్ మండలాల్లో , వికారాబాద్, పరిగిలోని ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ బంట్వారంలోని టీఎస్‌డబ్ల్యుఆర్ (గర్ల్స్), కొడంగల్‌లోని టీటీడబ్ల్యుఆర్ఎస్ ఒక్కో విద్యార్థికి 10జీపీఏ వచ్చింది. పరిగిలోని టీటీడబ్ల్యుయూఆర్‌జేసీ (జీ)లో ఐదుగురు 10 జీపీఏ సాధించారు. రంగారెడ్డి జిల్లాలో 16 మంది విద్యార్థులు పది జీపీఏ సాధించారు

30 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

ఈసారి పదో తరగతి ఫలితాల్లో రంగారెడ్డి జిల్లాలో గత ఏడాది 24 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి ఒక స్కూల్ పెరిగింది. మొత్తం 25 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి తోటి స్కూల్స్‌కు ఆదర్శంగా నిలిచాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఎదులాబాద్, కేశవాపూర్, అనంతారం ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల వరకు వస్తే రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. సల్బత్రాపూర్, మీనపల్లి కలాన్ జడ్పీఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పరీక్ష కట్టుదిట్టం... బాక్స్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వికారాబాద్ జిల్లా రెండోసారి ఆఖరు స్థానంలో నిలవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చివరి స్థానంలో నిలవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేఏడాది పదో తరగతి పరీక్షల్లో ఎదురైన అనుభవాల నేపథ్యంలో ఈ ఏడాది కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా, పకడ్బందీగా నిర్వహిస్తే ఆ ప్రభావం ఫలితాలపైన పడే అవకాశం ఉందని తెలిసినా జిల్లాలో ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికే కలెక్టర్ మొగ్గు చూపిన విషయం తెలిసిందే. వచ్చేవిద్యా సంవత్సరంలోనైనా పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పదిలో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 89.61 శాతం నమోదైంది. అందులో బాలికలదే పై చేయిగా నిలిచింది. 896 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలుండగా 46,736 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 41,879 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 89.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. 24,192 మంది బాలురులకుగాను 21,131 మంది ఉత్తీర్ణులయ్యారు. 87.35 శాతం ఉత్తీర్ణత సాధించారు. 22,544మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా అందులో 20,748 మంది ఉత్తీర్ణులయ్యారు. 92.03శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 30: మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సంతోష్, వీరేశం తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటేసి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

వికారాబాద్/నవాబుపేట/బషీరాబాద్/బంట్వారం, ఏప్రిల్ 30: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పూడూరు మండలంలోని తదితర గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వికారాబాద్‌లోని కొత్రేపల్లి, శివారెడ్డిపేట గ్రామాల్లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళి, వేణుగోపాల్ రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్, ముత్తాహర్ షరీఫ్, మల్లికార్జునగౌడ్, చాపల శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా నవాబుపేట మండలంలోని పులుమామిడి, చంచల్‌పేట్, చిట్టిగిద్ద తదితర గ్రామాల్లో రంజిత్‌రెడ్డి సతీమణి సీత రంజిత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్‌భరత్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మండల మహిళా అధ్యక్షురాలు ప్రభావతి, పుష్పమ్మ, రమ్యశ్రీ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా బషీరాబాద్ మండలంలోని ఎక్మాయిలో రంజిత్‌రెడ్డి తరఫున ఆ పార్టీ సీనియర్ ఎం. దుశ్యంత్‌రెడ్డి నేతృత్వంలోమంగళవారం స్థానిక నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బంట్వారం మండలంలోని మాలసోమారంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



కడుమూరులో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

చేవెళ్ల/కందుకూరు/రాజేంద్రనగర్/హైదర్‌నగర్ ఏప్రిల్ 30 : ఎంపీ రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆలూర్, వెంకన్నగూడ గ్రామాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై.. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ.. ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చే ప్రజానేత రంజిత్‌రెడ్డి అని అన్నారు. చేవెళ్లలో రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డికి మరో అవకావం ఇవ్వాలని కోరారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి నిరంతరం పని చేస్తామన్నారు. ఇన్‌చార్జి పామెన భీంభరత్, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పెంటయ్యగౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాములు, యాదమ్మ, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, అనంతరాములు గౌడ్, ప్రభాకర్, జంగారెడ్డి, బీమయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గోపాల్ యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అదేవిధంగా పదేళ్ల కాలంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు దోపిడీ, మోసాలకు పాల్పడ్డాయని, ప్రజలకు సుస్థిరపాలన అందించే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేయాలని పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ప్యాక్స్ మాజీ ఛైర్మన్ ఎస్.మల్లేష్‌కురుమలు ఓటర్లను కోరారు. ఏనుగు జంగారెడ్డి అన్నోజిగూడ, తిమ్మాయిపల్లిలో, కొలన్‌గూడ, సాయిరెడ్డిగూడలో జడ్పీటీసీ, నాయకులు ఎస్.వెంకట్రాంరెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌లు, మీర్కాన్‌పేట తదితర గ్రామాల్లో సరికొండ మల్లేష్, ఎస్.కృష్ణానాయక్‌లు ఇంటింటికి వెళ్లి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవుపల్లి డివిజన్ శ్రీరాంనగర్, నేతాజీనగర్, వెంకటేశ్వర కాలనీ, బుద్వేల్ రైల్వేస్టేషన్ బస్తీలలో రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి, నాయకులు సానెం శ్రీనివాస్‌గౌడ్, సామ ఇంద్రపాల్ రెడ్డి, ఎన్.ధనుంజయ్‌లతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా శివరాంపల్లి బస్తీ అధ్యక్షుడు ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ కేటీఆర్‌నగర్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



చేవెళ్ల : ఆలూర్‌లో ప్రచారం చేస్తున్న సీతారెడ్డి

‘పది’ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



వికారాబాద్: 10 జీపీఏ సాధించిన విద్యార్థులతో భృంగీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్



సాత్వీక(10/10), గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్, పరిగి



అనుష్క, (10/10), పట్లూర్ మోడల్ స్కూల్



ఇందు(10/10) గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్, పరిగి



మహిశ్రీ(10/10), గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్, పరిగి



కె.కీర్తన (9.8), రెసిడెన్సియల్ పాఠశాల, బంట్వారం



పావని (9.8), బురాన్‌పూర్ మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల



శృతిలయ(9.5), బంట్వారం పాఠశాల



గాయత్రి (9.5), బంట్వారం పాఠశాల



ప్రార్థన (9.3) యాలాల జడ్పీహెచ్ఎస్

వికారాబాద్/బంట్వారం (కోట్‌పల్లి)/ధారూరు/మోమిన్‌పేట్/ నవాబుపేట/మర్పల్లి, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాలు మంగళవారం ఉదయం విడుదల కాగా వికారాబాద్, మేడ్చల్ జిల్లాల విద్యార్థులు సత్తాచాటారు. వికారాబాద్‌లో భృంగీ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు 10/10జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా వారిని భృంగీ విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి, ప్రిన్సిపల్ రమాదేవి, కళాశాల డైరెక్టర్ శివప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా సంఘం లక్ష్మీబాయి విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాధికారి బాబుసింగ్ తెలిపారు. కేజీబీవీలో 94శాతం ఉత్తీర్ణత, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో 88శాతం, వికారాబాద్ జడ్పీహెచ్ఎస్ (బాలుర) 38శాతం, బాలికల 72శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. అనంతగిరిపల్లి 45శాతం, ఆలంపల్లి తెలుగు మీడియం 35శాతం, ఆలంపల్లి ఉర్దూమీడియం 29శాతం, గొట్టిముక్కుల స్కూల్ 54శాతం, మద్గుల్‌చిట్టంపల్లి 54శాతం, జైదుపల్లి 43శాతం, వెంకటపూర్‌తండా 67శాతం, పులుసుమామిడి 20శాతం, సిద్దులూరు 63శాతం, మైలార్ దేవరంపల్లి 65శాతం, మదన్‌పల్లి 62శాతం, పులుమద్ది 50శాతం, కొత్తగడి 71శాతం, ఉర్దూ మీడియం 50శాతం ఉత్తీర్ణ సాధించారన్నారు. శివారెడ్డిపేట 62శాతం, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కొత్తగడి 94శాతం, మైనార్టీ గురుకుల బాలుర 97 శాతం బాలికల 97శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా సంకల్ప్ విద్యాపీఠం విద్యార్థులు ఆరుగురు 10/10జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ ధన్‌శెట్టి తెలిపారు. 49 మంది విద్యార్థులకు గాను 6 మందికి 10 జీపీఏ నలుగురికి 9.8 జీపీఏ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా బంట్వారం మండలంలో ఏడు పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 296 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 194మంది ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. అందులో రెసిడెన్సియల్ పాఠశాలకు చెందిన వైష్ణవి 10/10జీపీఏ, కీర్తన 9.8, మోడల్ స్కూల్‌లో శృతిలయ, గాయత్రిలు 9.5జీపీఏ సాధించారు. సల్బత్రాపూర్‌లో 100శాతం, బంట్వారం రెసిడెన్షియల్‌లో 98శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో 64శాతం, తొర్మామిడి ఉర్దూ మీడియంలో 50శాతం, బంట్వారంలో 28శాతం, తొర్మామిడిలో 19శాతం కేజీబీవీలో 65శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తంగా 66శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాధికారి వెల్లడించారు. అదేవిధంగా కోట్‌పల్లిలో ఆరు పాఠశాలలు ఉండగా అందులో 173మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 87మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారన్నారు. కోట్‌పల్లి కేజీబీవీలో 83శాతం, రాంపూర్‌లో 67శాతం, బర్వాద్‌లో 60శాతం, ఎన్నారంలో 45శాతం, కోట్‌పల్లిలో 34శాతం, మోత్కుపల్లిలో 33శాతం ఉతీర్ణత సాధించినట్లు వివరించారు. ధారూరులో తొమ్మిది ఉన్నత పాఠశాలలు ఉండగా 40శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 312 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 125 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా కుక్కింద ఉన్నత పాఠశాలలో నర్సాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని జి. స్పందన 8.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ధారూరు బాలుర పాఠశాలలో 26మంది, బాలికల పాఠశాలలో నలుగురు, కెరెల్లిలో ముగ్గురు, కుక్కిందలో 23మంది, మోమిన్‌కలాన్‌లో 11 మంది, నాగారంలో 21 మంది, నాగసమందర్ 12 మంది, తరిగోపుల 10, కేజీబీవీ పాఠశాలలో 15మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా మోమిన్‌పేట్ మండలంలోమొత్తం 401 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 223 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.నిఖిత 10/10, కే.సంజన 9.5, మోమిన్‌పేట్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పి.శాలిని 9, టీఎస్ఆర్‌డబ్ల్యూఎస్ పాఠశాలకు చెందిన ఏ.నిఖిత 9.5, సి.నవీన 9.3, టి.సంజన 9.7, మేకవనంపల్లి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన కొత్లపూరం కీర్తన 9.3, మోమిన్‌పేట్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సి.నవీన 9.3 జీపీఏ సాధించారు. నవాబుపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ప్రణీత్ 9.8 జీపీఏ సాధించగా ఎంఈవో గోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా మర్పల్లిలో 56శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 225 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారని తెలిపారు. మోడల్ స్కూల్‌లో చదువుతున్న పట్లూర్ గ్రామానికి చెందిన అనుష్క 10/10జీపీఏ సాధించినట్లు వెల్లడించారు.

పరిగిలో 64 శాతం ఉత్తీర్ణత

పరిగి/పూడూరు/దోమ/కులకచర్ల: పరిగి ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు 64శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. 13ఉన్నత పాఠశాలల నుంచి 618 మంది పరీక్షలు రాయగా, 396మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో అతి ఎక్కువగా బాలికల ఉన్నత పాఠశాల 95 శాతం ఉత్తీర్ణత సాధించింది. అతి తక్కువగా గడిసింగాపూర్ ఉన్నత పాఠశాల 32శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌ల 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. 364 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 349 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించింది. 73 మంది విద్యార్థులు పరీక్షలు రాగా, 73 మంది పాసయ్యారు. పరిగిలో గిరిగిజన బాలికల రెసిడెన్షిల్‌లో 99.09శాతం ఉత్తీర్ణత సాధించారు. 110 మంది బాలికల పరీక్షలు రాయగా, 109 మంది పాసయ్యారు. ఇందులో పది మందికి 10/10 జీపీఏ సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సుమతీ అభినందించారు అదేవిధంగా కృష్ణవేటి టాలెంట్ స్కూల్‌లో పది మందికి 10/10జీపీఏ సాధించారు. 188 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 186 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 99శాతం ఉత్తీర్ణత సాధించి పరిగి నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా కేటీఎస్ స్కూల్‌లో ఒకటవ తరగత నుంచి టెన్త్ వరకు చదివిని కవలపిల్లలు కె.కార్తీకరెడ్డి, కె.రుతికారెడ్డి 10/10జీపీఏ సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. అదేవిధంగా పూడూరు మండల కేంద్రంలో 448మంది విద్యార్థులు పదోతరగతి పరీక్ష రాయగా 239మంది ఉత్తీర్ణత సాధించారు. 49శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో మోడల్ స్కూల్‌కు చెందిన సాధియా 9.5జీపీఏ, జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని అర్చన 9.0జీపీఏ, కంకల్ జడ్పీహెచ్ఎస్‌లో ఎల్.వినయ్ 9, పూడూరు టీఎస్ఎంఎస్‌లో సాదియా ఇస్మాయిల్ 9.5, అర్చన 9 జీపీఏ సాధించారు. దోమ మండలంలోని 11 పాఠశాలల్లో 510 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 302 మంది ఉత్తీర్ణత సాధించారు. దాదాపూర్ పాఠశాలకు చెందిన శృతి 9.2జీపీఏ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మోత్కూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సింధూజ 9జీపీఏ సాధించింది. కులకచర్ల మండలంలో 811 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 526మంది ఉత్తీర్ణులయ్యారు. చౌడాపూర్ మండలంలో 263 మందికి గాను 97 మంది ఉత్తీర్ణులయ్యారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10మంది విద్యార్థులకు ఒకేవిద్యార్థిని ఉత్తీర్ణత సాధించింది.

కొడంగల్ బాలుర పాఠశాలలో 97శాతం ఉత్తీర్ణత

కొడంగల్/కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్/దౌల్తాబాద్: కొడంగల్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 67 మంది పరీక్షలు రాయగా 65 మంది విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ బలరాం తెలిపారు. పాఠశాలకు చెందిన పి.హరిచంద్ 10/10జీపీఏ, జె.సునీల్ 9.8 జీపీఏ, కొడంగల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో రుద్రారం గ్రామానికి చెందిన డి.సుగేందర్ 10/10 జీపీఏ సాధించాడు. ఎస్.వినయ్‌కుమార్ 9.8, కె.రాఘవేంద్ర, మనోజ్‌కుమార్, మనీష్‌కుమార్, ఎన్.రమేశ్, జే.శ్రీహరి, వీ.గురుమూర్తి 9.7 జీపీఏసాధించినట్లు ప్రిన్సిపాల్ శంకర్‌బాబు తెలిపారు. బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలకు చెందిన పావని 9.8, బొట్లవనితండా ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పి.స్రవంతి 9.3 జీపీఏ మార్కులు సాధించింది. బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 543 మందికి 378 మంది ఉత్తీర్ణత సాధించారు. దౌల్తాబాద్ మండలంలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన మొత్తం 364 మంది పరీక్షలు రాయగా 227 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో దౌల్తాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన దేవరకొండ అక్షయ్ 9.3 జీపీఏ, బాలంపేట పాఠశాలకు చెందిన యం.వైష్ణవి 9.3 జీపీఏ సాధించారు.

తాండూరు గురుకులంలో 98.6శాతం ఉత్తీర్ణత

తాండూరు/బషీరాబాద్/యాలాల/పెద్దేముల్, ఏప్రిల్ 30: తాండూరు బీఎస్ఆర్ఎస్ అండ్ జేపీ గురుకుల పాఠశాలలో 98.6శాతం ఉత్తీర్ణతను సాధించారు. తాండూరు నియోజకవర్గంలోనే గురుకుల పాఠశాల టాప్‌గా నిలించింది. పాఠశాలలో 73మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 72మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు 9.8జీపీఏ సాధించారు. అదేవిధంగా కృష్ణావేణి కాన్సెప్ట్ స్కూల్ 10/10జీపీఏ తొమ్మిది మంది విద్యార్థులు సాధించారు. చైతన్య పాఠశాలలో 10/10 జీపీఏ ఐదుగురు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఐదుగురు విద్యార్థులు 10/10జీపీఏ సాధించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో వెనుకబడిపోయాయి. బషీరాబాద్‌లో పదోతరగతి ఫలితాలు నిరాశ పరిచాయి. ఈ ఏడాది మొత్తం 506మంది విద్యార్థులు పది పరీక్ష రాయగా 182మంది విద్యార్థులు మాత్రం ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా పదిలో 35.97శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండల వ్యాప్తంగా 11జడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, తెలంగాణ మోడల్ స్కూల్ ఉండగా పాఠశాలల్లో 8.5 జీపీఏకు మించి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఈ సారి పదిలో బాలురతో పోలిస్తే బాలికలు అధికంగా ఉత్తీర్ణులయ్యారు.ఏదేమైనా మంగళవారం పది ఫలితాలపై మండలంలో చర్చనీయంశమైంది. యాలాల మండలంలోని మొత్తం 592 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 309 మంది ఉత్తీర్ణులయ్యారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఊరడి ప్రార్థన మండల టాపర్‌గా నిలిచింది. వీరిలో తెలంగాణ సోషల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన దివ్య జ్యోతి 9.7జీపీఏ సాధించింది. గౌతమి మోడల్ స్కూల్ విద్యార్థిని నవనీత 10/10జీపీఏ సాధించింది. స్ఫూర్తి 9.8జీపీఏ సాధించింది. పెద్దేములో 45శాతం విద్యార్థులు పాసయ్యారు. పెద్దేముల్ మండలంలోని 9ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గొట్లపల్లి మోడల్ స్కూల్‌లో మొత్తం 506 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 228 మంది విద్యార్థులు పాసయ్యారు. మంబాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి కె.సంపత్ కుమార్ 9.3 జీపీఏ, భానుప్రసాద్ 9.0 సాధించారు. జడ్పీహెచ్ఎస్ తట్టెపల్లి 68శాతం ఫలితాలతో మొదటిస్థానంలో నిలవగా 33శాతం ఫలితాలతో ఇందూరు జడ్పీహెచ్ఎస్ చివరిస్థానంలో నిలిచింది. ఉర్దూమీడియం పాఠశాలలో 30శాతం ఫలితాలతో పూర్తిగా చివరిస్థానంలో నిలిచింది. మంబాపూర్‌లోని వికారాబాద్ ఎంజేపీటీ బీసీడబ్ల్యూఆర్ పాఠశాలలో చదువుతున్న ధారూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన విద్యార్థి మహమ్మద్ సాజిద్ 10/10జీపీఏ సాధించాడు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

కీసర రూరల్/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట/మేడ్చల్ టౌన్: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో కీసర ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఆంగ్ల మాధ్యమం రాంచరణ్ రెడ్డి మంగళవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 10/10 గ్రేడ్ మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రాంచరణ్‌రెడ్డిని అభినందించారు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో నాగారం, దమ్మాయిగూడ జడ్పీహెచ్ఎస్‌లో 63శాతం, రాంపల్లిలో 65శాతం ఉత్తీర్ణత సాధించారు. దమ్మాయిగూడలో 9.8, రాంపల్లిలో 9.5, నాగారంలో 9.3 అత్యధిక మార్కులు వచ్చాయి. అదేవిధంగా నాగారం మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాలలో 70మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 61 మంది ఉత్తీర్ణులయ్యారు. డి.అవినాష్ అనే విద్యార్థి 10జీపీఏ సాధించాడు. ఘట్‌కేసర్‌తో పాటు ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలోని 9 జిల్లా పరిషత్ పాఠశాలలో మొత్తం 508మంది పరీక్షలు రాయగా అందులో 368 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 72శాతం ఉత్తీర్ణత ఉండగా, అందులో బాలికలు 81శాతం, బాలురు 63శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అత్యధికంగా జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన నిషా 9.8 జీపీఏ, హసిని 9.3, మేఘన 9.2 జీపీఏ సాధించారు. ఎదులాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల (మల్కాజ్‌గిరి)పాఠశాలలో నతీషా 9.8జీపీఏ సాధించగా,



మంచాల నిషా (9.8), జిల్లా పరిషత్ బాలికల పాఠశాల



ఎస్.నతీషా (9.8), సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల



హసిని (9.3) జడ్పీహెచ్ఎస్, ఘట్‌కేసర్



కె.రుజిత, (9.7) నూతన్‌కల్ జడ్పీహెచ్ఎస్

జిల్లా పరిషత్ ఎదులాబాద్ బాలుర పాఠశాల విద్యార్థిని జయకుమారి 9.2జీపీఏ సాధజంచింది. జిల్లా పరిషత్ ఎదులాబాద్ బాలికల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల (మల్కాజ్‌గిరి)పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ శాలువాతో సత్కరించారు. శామీర్‌పేట మండలంలో ఈ సారి టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు 75.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వసంతకుమారి వెల్లడించారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 303 మంది పరీక్షలు రాయగా 229మంది ఉత్తీర్ణులై 75. 5 శాతంగా ఫలితాలను సాధించారు. జడ్పీ అలియాబాద్ పాఠశాలకు చెందిన విద్యార్థిని రజిత అత్యధికంగా 9.7 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. జడ్పీ తూంకుంట పాఠశాలకు చెందిన లినాశ్రీ 9.3జీపీఏ, తుర్కపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన రఘునాథ్ 9.2జీపీఏ, జడ్పీ అలియాబాద్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఐశ్వర్య 9.2జీపీఏ, జడ్పీ అలియాబాద్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సౌమ్య 9.0జీపీఏ సాధించారు. శామీర్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 85శాతం టెన్త్ ఫలితాలను సాధించగా జడ్పీ తూంకుంట పాఠశాల విద్యార్థులు 80శాతం టెన్త్ ఫలితాలను సాధించి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈ వసంతకుమారి వెల్లడించారు. నూతన్‌కల్ గ్రామ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కె.రుజిత 9.7జీపీఏ సాధించింది. రుజిత తల్లిదండ్రులు స్వామి, సరిత, అన్న సాయిచరణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. అయినప్పటికీ పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించింది.

సంక్షిప్తంగా..

● **తాండూరురూరల్:** మండలంలోని జినుగుర్తి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మూడు రోజులపాటు నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్టాపనతోపాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి.

● **పెద్దేముల్** పెద్దేముల్ మండలం రుద్రారంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి నూతనంగా బోనమ్మ ఆలయాన్ని నిర్మించి వైభవంగా విగ్రహప్రతిష్టాపన జరిపించారు. నూతన విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గత రెండురోజులుగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి అనురాగ్ యూనివర్సిటీ ఆంగ్ల విభాగాధిపతి లక్ష్మీరమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** మండలంలో నెలకొన్న నీటి సమస్యకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది.

● **వికారాబాద్:** మే డే సందర్భంగా నేడు(బుధవారం) కార్మికులకు సెలవు ప్రకటించినట్లు కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** వెంచర్‌లో పనులు చేస్తుండగా జేసీబీ ఢీకొనడంతో నాలుగు విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి.మంగళవారం కొత్త స్తంభాలతో పాటు తీగలను లాగి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి ప్రచారం



మేడ్చల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సునీతామహేందర్‌రెడ్డి

మేడ్చల్ టౌన్ ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థిని సునీతీ మహేందర్ రెడ్డి మంగళవారం మేడ్చల్, డబిల్‌పూర్, రావల్‌కోల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలీటీల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ ఈ పది రోజులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి గడపగడపకు ప్రచారం చేసి అధిక మెజార్టీ సాధించే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఐదు సంవత్సరాలు తాను మీ కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, వేణుగోపాల్, అంజలి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

పూడూరు, ఏప్రిల్ 30: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంగడిచిట్టెంపల్లికి చెందిన విరజానంద్(28) మన్నెగూడ నుంచి స్వగ్రామమైన అంగడి చిట్టెంపల్లికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో కండ్లపల్లి మూల మలుపులో ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టింది. బైక్ నడుపుతున్న విరజానంద్ తలకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

తాండూరురూరల్, ఏప్రిల్ 30 : గుర్తుతెలియని మహిళ మృత దేహం లభ్యమైనట్లు తాండూరు మండలం కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రవంచ గ్రామ శివారులోని వాగులో ఓ మహిళ మృత దేహం నీటిపై కనిపించడంతో ఆ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.వాగులో 30-40ఏళ్ల మధ్యగల మహిళ మృత దేహం ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వికారాబాద్, ఏప్రిల్ 30: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో అడ్మిట్ అయ్యాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ నాగరాజు వెల్లడించారు. వివరాలు తెలిస్తే 8712670030 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

చేపల వేటకు వెళ్లి వేర్వేరు చోట్ల ఇద్దరు..

మూడుచింతలపల్లి/యాలాల, ఏప్రిల్ 30: మూడుచింతలపల్లి మండలం అద్రాస్ పల్లి కి చెందిన కావలి మల్లేశ్ (55). గ్రామ పరిధిలోని ఎల్లగూడ వాగులో సోమవారం చేపలు పట్టడానికి వెళ్లాడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందగా మంగళవారం మృతదేహం తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా యాలాలలోని బెన్నూర్ గ్రామ సమీపంలో గల రాజన్‌కుంట చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. బెన్నూర్ గ్రామానికి చెందిన కుర్వ నర్సిములు (25)గా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 30: ఇంజనీరింగు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్, సంతోష్ నగర్ కాలనీకి చెందిన పెద్ది అనిత, ఎల్లారెడ్డి కుమారుడు పెద్ది అశ్రీత్(19) వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ, యూనివర్సిటీకి చెందిన హాస్టల్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఏప్రిల్ 25 ఆచూకీ తెలియకపోవడంతో తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

ప్రయాణికుడికి బ్యాగు అప్పగింత

తాండూరు, ఏప్రిల్ 30: రైల్వేశాఖలో ప్రవేశపెట్టిన ఆపరేషన్ అమానత్ కార్యక్రమం కింద రైల్వే ప్రయాణికులు యంగళవారం షేక్ సిరాజుద్దీన్ అనే వ్యక్తి పోగొట్టుకున్న బ్యాగ్‌ను వెతికి పట్టుకుని అప్పగించారు. ఆ బ్యాగులో బంగారం, నగదు మొత్తం విలువ రూ. లక్షా 55 వేలు ఉంటుందని తెలిపారు.

వినియోగదారునిపై దాడి.. కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 30: ఐస్‌క్రీం కావాలని అడిగిన దాడిచేసిన ఇద్దరు మార్ట్ సిబ్బందిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. యాదాద్రీ-భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లికి చెందిన అరిగే సాయికుమార్ అతని భార్య సోని తన కూతురు జెస్సికాలు యంనంపేటలో బంధువుల ఇంట్లో సోమవారం జరిగిన శుభకార్యానికి వచ్చారు. అదేరోజు రాత్రి 9గంటలకు సాయికుమార్, సోని జెస్సికా ఘట్‌కేసర్‌లోని కృష్ణమార్ట్‌కు వచ్చారు. తన కూతురు ఐస్‌క్రీం కావాలని అడుగగా సాయికుమార్ మార్ట్‌కు వెళ్ళి ఐస్‌క్రీం కావాలని అడగగా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఈ క్రమంలో వాగ్వివాదం జరిగింది. మార్ట్ సిబ్బంది జీశాంత్, అజిత్‌సింగ్‌లు సాయికుమార్‌పై దాడిచేసి గాయపరిచారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రచారంలో జోరు పెంచిన బీజేపీ



బీజేపీలో చేరుతున్న మాజీ జడ్పీటీసీ శైలజ

మౌలాలి/మేడ్చల్ టౌన్/మల్కాజిగిరి/ అల్వాల్/నేరేడ్‌మెట్/ వనస్థలిపురం/ కొత్తపేట/ ఓల్డుబోయినపల్లి/ పేట్‌బషీరాబాద్/ బోయినపల్లి/కూకట్‌పల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ ఇందిరనగర్, బీహార్ బస్తీలలో ఇంటింటికి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాస్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో హస్మత్‌పేట్‌లో ఉన్న జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘాల నాయకులు, కమిటీ సభ్యుల సమావేశంలో ఈటల పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో కిసాన్ మోర్చా, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బి కాలనీలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కేపీహెచ్‌బి టెంపుల్ బస్ స్టాప్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఈటల మాట్లాడారు. మాజి సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో హిందూగాల్లు బొందూగాల్లు అని వ్యాఖ్యానించటంతోనే ప్రజలు ఆయనపై తిరగబడేందుకు ఆస్కారం కల్గిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని, గడిచిన నాలుగు నెలల్లో ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగతా హామీలన్ని నెరవేర్చలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, కన్వీనర్ శ్రీకర్ రావు, కార్పొరేటర్ మహేందర్, నాయకులు యంజాల పద్మయ్య, వడ్డేపల్లి రాజేశ్వర రావు, ప్రీతం రెడ్డి, సందీప్ మిశ్రా, సురేందర్ రెడ్డి, షాజహాన్, విశ్వేశర రావు పాల్గొన్నారు.కంటోన్మెంట్ బోయినపల్లి ప్రాంతానికి చెందిన పద్మశాలి సంఘం తమ మద్దతు బీజేపీకి ఉంటుందని, అందుకే ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపుకోసం కృషిచేస్తామని తెలిపారు. మౌలాలి డివిజన్ ఈస్ట్ ప్రగతినగర్ కాలనీలో కార్పొరేటర్ గున్నాల సునీతయాదవ్ బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం చేపట్టి ఈటలకు మద్దతుగా నిలవాలని కోరారు. మేడ్చల్ మండల మాజీ జడ్పీటీసీ శైలజ మంగళవారం బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, తదితరుల సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో ఈటల ఇంటింటి ప్రచారం నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అల్వాల్‌లో మాజీ కౌన్సిలర్ నిమ్మ కృష్ణారెడ్డి ఈటలకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, రాజు, సర్వేశ్వర్‌రావు,నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లో మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వనస్థలిపురం డివిజన్ హిల్‌కాలనీలోని 300 బూత్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి సామ రంగారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, బద్దం రామ్‌రెడ్డి, మధుకర్ గౌడ్, రాజ్ కుమార్, బద్రి, రాజు పాల్గొన్నారు. నాగోల్ శుభం కన్వెన్షన్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామరంగారెడ్డి సమక్షంలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు చిన్నం నరేష్, శీలం గోపికి ఈటల రాజేందర్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త రవీందర్ గౌడ్, పల్లె గణేష్‌గౌడ్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా కొంపల్లి మున్సిపాలిటీలోని 12, 13 వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్‌సీఎల్ నార్త్ నోబుల్ కాలనీలో ప్రచారాన్ని నిర్వహిస్తూ ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివాజీరాజు, రాజిరెడ్డి, సతీష్‌సాగర్, రాజశేఖర్‌రెడి పాల్గొన్నారు.